# జైహింద్

## -పుట్టగంటి గోపీకృష్ణ



### పిడపర్తి వెంకటరమణశర్మగారి జ్ఞాపకార్థం కౌముది నిర్వహించిన నవలల పోటీ (2023)లో బహుమతి పొందిన ఉత్తమ నవల

### (గత సంచిక తరువాయి)

**కలనల్ వార్నర్ కలకత్తాలోని** ఫోర్ట్ విలియమ్‌లో మీటింగ్ పెట్టాడు. అతని ముఖ్య అధికారులందరినీ పిలిపించాడు.

“ఆర్మీ హెడ్‌క్వార్టర్ నుండి ఆదేశాలు వచ్చాయి. ఆజాద్ హింద్ ఫౌజ్, జపాన్ ఉమ్మడి దళాలు ఇంఫాల్, కోహిమాల మీదగా ఇండియాలోకి రావటానికి సన్నద్ధం అవుతున్నాయని ఇంటెలిజెన్స్ రిపోర్ట్ వచ్చింది…” అంటూ చెప్పుకొచ్చాడు వార్నర్.

“మన బలగాలు కూడా తయారుగా ఉన్నాయి సర్…” చెప్పాడు ఒక అధికారి.

“ఇంఫాల్ పరిస్థితి ఏమిటి?”

“నాలుగు ఇన్‌ఫాంట్రీ డివిజన్లు, ఒక ఆర్మర్డ్ బ్రిగేడ్ సిద్ధంగా ఉన్నాయి. విలియమ్ స్లిమ్, జెఫ్రీ స్కూన్స్ వాటికి సారథ్యం వహిస్తున్నారు. ఇద్దరు యుద్ధ కళలో ఆరితేరిన వారే…”

“మరి కోహిమా పరిస్థితి ఏమిటి?”

“అక్కడ రెండు ఇన్‌ఫాంట్రీ డివిజన్లు ఉన్నాయి. ఇంఫాల్‌లో పది వేల మంది, కోహిమాలో అయిదు వేల మంది ఉన్నారు. అవసరమయితే వెళ్లటానికి పది వేల మంది సైన్యం కలకత్తాలో తయారుగా ఉంది. మీరు అనుమతి ఇస్తే బలగాలను ఇంఫాల్, కోహిమాలకు పంపుదాం…”

చాలా సేపు ఆలోచిస్తూ ఉండిపోయాడు వార్నర్. చివరకు, “మనం పంపితే మరో పది వేల మందిని పంపగలం. కానీ వారి ఉమ్మడి సైన్యంలో యాభై వేల కంటే ఎక్కువ సైన్యం ఉంది…”

“హెడ్‌క్వార్టర్ నుండి ఇంకొన్ని డివిజన్లను పంపమని అడుగుదామా?”

"మనం ఉన్న వారితోనే మానేజ్ చేసుకోవాలని వారు ముందే చెప్పారు."

ఎవరూ ఏమీ మాట్లాడ లేదు.

"ఇలాంటి పరిస్థితుల్లో యుద్ధంలో ఎవరు గెలుస్తారో తెలుసా?" అని తన సహచరులను అడిగిన వార్నర్. "ఎవరి ఇంటెలిజెన్స్ ఎక్కువ బలంగా ఉంటే వారు గెలుస్తారు." అని సమాధానం తనే చెప్పాడు.

"అవును సర్. వారి గూఢచారులు నగరంలో ఉన్నారు. ఇంఫాల్, కోహిమా, కలకత్తా నుండి సమాచారం రేడియో మెసేజ్‌ల ద్వారా వారి హెడ్‌క్వార్టర్‌కు పంపుతున్నారు."

"యుద్ధంలో సమాచారం చాలా ముఖ్యం. అదే సమయంలో తప్పుడు సమాచారం గెలుపు, ఓటములను నిర్ణయిస్తుంది. శత్రు గూఢచారులను కట్టడి చేయటంలోనే మన విజయం ఆధారపడి ఉంటుంది. ఒక్క శత్రు గూఢచారి మనకు పట్టుబడితే చాలు, తప్పుడు సమాచారం శత్రువుకు చేరవేయవచ్చు. కానీ... మీరు ఇంత మంది ఉండి ఏం చేస్తున్నారు? ఒక్క గూఢచారిని ఇంతవరకు పట్టుకోలేక పోయారు..." అన్నాడు వార్నర్ కోపంగా.

ఎవరూ ఏమీ మాట్లాడ లేదు.

"అందరూ అదే పని మీద ఉండండి. ఒక్క గూఢచారిని నాకు అప్పచెప్పండి. మిగిలింది నేను చూసుకుంటాను..." అంటూ సమావేశం ముగించాడు వార్నర్.

సంతోష్ తెల్లవారక ముందే కలకత్తాలోని జాదవ్‌పూర్‌లో తన ఇంటి నుండి బయలు దేరాడు. కలనల్ వార్నర్ ఉండే ఫోర్ట్ విలియమ్ దాదాపు 10 కిలోమీటర్ల దూరం ఉంటుంది.

అతను సింగపూర్ నుండి వచ్చి మూడు నెలలు అవుతోంది. ఆజాద్ హింద్ ఫౌజులో తర్ఫీదు పొంది గూఢచారిగా ఇండియా చేరుకున్న 130 మందిలో అతను ఒకడు. అయితే మిగిలిన గూఢచారులకు, సంతోష్‌కి మధ్య ఒక తేడా ఉంది. అతనికి ప్రాణాల మీద తీపి కంటే దేశభక్తి మీద ప్రేమ ఎక్కువ. ఏవో తెలిసిన చిన్న చిన్న విషయాలు హెడ్‌క్వార్టర్స్‌కి పంపి సంతుష్టి చెందే రకం కాదు అతను. ఏదో సాధించాలి, బ్రిటిషు వారి మీద జరుగుతున్న యుద్ధంలో తన పాత్ర ఉండాలని బలంగా కోరుకున్నాడు.

అందుకు అతనికి కనిపించిన మార్గం విలియమ్ ఫోర్ట్‌లో ఉన్న మిలటరీ ఆఫీసుల్లో ఎక్కడో ఒక చోట పనికి కుదురుకోవటం. అక్కడ పనికి కుదరటం అంటే మాటలు కాదు. ఆ రోజుల్లో ఫోర్ట్ విలియమ్ పరిసరాల్లోకి రావటానికి కూడా భారతీయులకు అనుమతి లేదు. అలాంటి చోటకు తను వెళ్లాలంటే ఉన్న ఏకైక మార్గం పనివాడిగా వెళ్లటం. కానీ అది కూడా అంత తేలిక కాదు. పని ఇచ్చే ముందు వారు చాలా రకాలుగా తన పుట్టు పూర్వోత్తరాలను పరిశీలిస్తారు. అందుకే అతను ముందుగా తాను సింగపూరులో ఉన్న రెండు సంవత్సరాల కాలానికి ఎలిబీ సృష్టించుకున్నాడు.

తరువాత ఎవరికీ అనుమానం రాకుండా ఫోర్ట్ విలియమ్ ముందు కాపలా కాసి అందులో నుండి బయటకు వచ్చే పనివాళ్లను పరిశీలించాడు.

వారందరిలో బిపిన్ అతనికి అనువుగా కనిపించాడు. బిపిన్ సరాసరి కల్నల్ విలియమ్ ఇంట్లో పనిచేస్తున్నాడు. అతని స్థానంలో తను పనికి కుదిరితే తన పని సులువు అవుతుందని భావించాడు.

అయితే అనుకోకుండా జరిగిన ప్రమాదంలో చెయ్యి విరిగే వరకు, సహకరించటానికి బిపిన్ అంత తేలిగ్గా అంగీకరించలేదు. చెయ్యి బాగు పడిన తరువాత తిరిగి తన ఉద్యోగం తనకు ఇప్పిచ్చే పూచీ మీద సంతోష్‌ని తన బంధువుగా పరిచయం చెయ్యటానికి ఒప్పుకున్నాడు బిపిన్.

అయితే బిపిన్ చేయి విరగటానికి తను, తన మిత్ర బృందం కారణమనే విషయాన్ని చాలా రహస్యంగా దాచాడు సంతోష్.

వార్నర్ వ్యక్తిగత గదులు శుభ్రం చేయటం మాత్రమే కాకుండా అతనికి షేవ్ చేయటం కూడా బిపిన్ చేసేవాడు. వార్నర్ ఆఫీసుకు వెళ్లిన తరువాత ఇంటి చుట్టూ ఉన్న తోట పని పూర్తి చేసి సాయంత్రం ఇంటికి వెళ్తాడు.

ఈ విషయాలన్నీ ముందే తెలుసుకున్న సంతోష్, బిపిన్ చేయి విరగటానికి ముందే... నీటుగా షేవ్ చేయటం ప్రాక్టీస్ చేశాడు.

సంతోష్‌ని బిపిన్ రికమండ్ చేయటంతో, అతని మీద ఎవరికీ అనుమానం రాలేదు. తాత్కాలికంగా అతన్ని చేర్చుకున్నారు బ్రిటిషు ఆర్మీ అధికారులు.

వారికి అనుమానం రాకుండా ఉండటానికి తనకు అసలు ఇంగ్లీషు రాదని అబద్ధం చెప్పాడు సంతోష్. అందుకు అనుగుణంగా మొదటి రోజు వార్నర్ అడిగిన ప్రశ్నలకు సరిగ్గా సమాధానం చెప్పక తిట్లు కూడా తిన్నాడు.

వార్నర్ కూడా ఇంగ్లీషు రాని వాడు పనివాడుగా ఉండటం తనకు కూడా మంచిది అనుకోవటంతో ఆ తరువాత అతన్ని పట్టించుకోలేదు. ఉదయం షేవ్ చేసేటప్పుడు కూడా అతనితో మాట్లాడే వాడు కాదు.

చకచక సైకిల్ తొక్కుతూ అరగంటలో సంతోష్ ఫోర్ట్ విలియమ్ ముఖ ద్వారం దగ్గరకు చేరుకున్నాడు.

సైకిల్ పక్కన పెట్టి, చెకింగ్ పూర్తి చేసుకున్న తరువాత పరుగెత్తుతున్నట్లు వార్నర్ ఇంటి వైపు నడిచాడతను.

అతను వెళ్లేటప్పటికే వార్నర్ ఇంట్లో లేడు. ప్రతి బుధవారం ఉదయాన్నే ఇంటి పక్కనే ఉన్న టెన్నిస్ కోర్టుకు వెళ్తాడతను. ఒక గంట సేపు టెన్నిస్ ఆడి ఇంటికి వచ్చి టీ తాగి షేవ్ చేయించుకుంటాడు. ఈలోపు అతని గదులు శుభ్రం చేసి రెడీగా ఉంటాడు సంతోష్.

సంతోష్ వార్నర్ ఆఫీసు గదిని ఊడ్చి, తుడిచి శుభ్రం చేస్తూనే ఒక కన్ను పరిసరాల మీద వేసి ఉంచాడు. ఆ రోజు కొన్ని కాగితాలు టేబుల్ మీద పెట్టి ఉన్నాయి. తను వాటిని చదివే ప్రయత్నం చేయవచ్చు. కానీ బయట కారిడార్‌లో ఒక

సార్జంటు నిలబడి ఉంటాడు. అతను ఒక కన్ను తన మీద వేసి ఉంచుతాడు. తను ఆ గదిలోని కాగితం చదువుతూ కనిపిస్తే, ఇక ఇంతే సంగతులు.

అందుకే సంతోష్ కొన్ని కాగితాలు కింద నేల మీద పడేశాడు. ఇల్లు తుడుస్తున్నట్లు నటిస్తూ, కింద పడిన కాగితాలను గమనించాడు. అవన్నీ మిలటరీ మూమెంటుకు సంబంధించిన కాగితాలు. ఆజాద్ హింద్ ఫౌజుకు ఉపయోగపడవచ్చు. కానీ వాటిని ఎక్కడా రాసుకోలేడు. ఇంటికి వెళ్లేటప్పుడు అతన్ని చెక్ చేస్తారు. ఆ సమయంలో అతని దగ్గర చిన్న కాగితం ముక్క దొరికినా అది పెద్ద నేరం అవుతుంది. అక్కడికక్కడే వాటిని నాలుగయిదు సార్లు చదివి మననం చేసుకున్నాడు. తరువాత కాగితాలు సర్ది టేబుల్ మీద పెట్టి బయటకు వచ్చేశాడు.

మనసులో పదే పదే తనకు తెలిసిన సమాచారాన్ని మననం చేసుకుంటూ గుర్తు ఉంచుకునే ప్రయత్నం చేస్తున్నాడు సంతోష్.

ఇంతలో వార్నర్ తిరిగి వచ్చాడు.

అప్పటికే వంటవాడు గార్డెన్‌లో టీపాయ్ మీద టీ కెటిల్ రెడీగా ఉంచాడు. తను కూడా షేవింగ్ కిట్ తీసుకుని దూరంగా నిలబడ్డాడు సంతోష్.

వార్నర్ టీ తాగటం పూర్తయ్యాక అతను పిలిచినపుడు దగ్గరకు వెళ్లి షేవ్ చేశాడు.

మరి కాసేపటి తరువాత వార్నర్ స్నానం చేయటానికి వెళ్లిపోయాడు.

ఆ సాయంత్రం వరకు సంతోష్ తనకు తెలిసిన సమాచారాన్ని మరచిపోకుండా ఉండేందుకు ప్రయత్నిస్తూ ఉండిపోయాడు. సాయంత్రం అక్కడ నుండి బయట పడి ఇంటికి చేరిన తరువాత తనకు గుర్తు ఉన్నదంతా కాగితం మీద రాసుకున్నాడు. తరువాత దానిని ఎంత క్లుప్తంగా రాయవచ్చో అంత కుదించాడు.

రాత్రి పొద్దు పోయిన తరువాత తన గదిలో అటక మీద దాచిన ట్రంకు పెట్టె ను కిందకు దించాడు. అది పెట్టె రూపంలో ఉన్న రేడియో ట్రాన్స్‌మిషన్ పరికరం.

బాగా పొద్దు పోయిన తరువాత ఆ ట్రంకు పెట్టెను సైకిల్ వెనుక పెట్టుకుని, మెయిన్ రోడ్డు మీద కాకుండా సందులు గొందుల నుండి హుగ్లీ తీరం వైపు వెళ్లాడు. అక్కడ నిర్మానుష్యంగా ఉన్న ప్రదేశం చూసుకుని ట్రంకు పెట్టెను సైకిల్ మీద నుండి దించకుండా ఓపెన్ చేశాడు. రేడియో ఆన్ చేసి అవతల వైపు నుండి ఆమోదం వచ్చిన తరువాత చకచక మోర్స్ కోడులో తను పంపదలచుకున్న సమాచారం పంపి, వెంటనే పెట్టె మూత వేసి వచ్చిన దారిలో వెనక్కి వెళ్లిపోయాడు.

మిలటరీ పోలీసులు శత్రు గూఢచారి పంపుతున్న రేడియో ట్రాన్స్‌మిషన్ గురించి తెలుసుకుని వెతుకులాట మొదలు పెట్టారు. అయితే కోహిమా లాగా జనావాసాలు తక్కువ ఉన్న ఊర్లో అది సాధ్యమేమో కానీ, కలకత్తా లాంటి పెద్ద నగరంలో దాదాపు అసాధ్యం. వారు ఆ దరిదాపుల్లోకి వచ్చేలోపు సంతోష్ తన ఇంటికి వెళ్ళిపోయాడు.

ఆ రోజు దేశం కోసం ఒకటైనా పనికి వచ్చే పని చేసిన తృప్తితో సంతోష్ నిద్ర పోయాడు.

కలనల్ వార్నర్ వ్యాయామం చేయటం ముగించుకున్నాడు. అత్యవసర మీటింగ్ ఉండటంతో మిగిలిన పనులన్నీ త్వరత్వరగా ముగించాడు. ఆఫీసుకు వెళ్లబోతూ, అవసరమయిన కాగితాల కోసం తన గదిలోకి వచ్చాడు.

కాగితాలు చేతిలోకి తీసుకుంటుంటే అవి తను పెట్టిన ఆర్డర్‌లో లేవని అనిపించింది. ఇలా అనిపించటం ఇది మొదటిసారి కాదు. ఈమధ్య ఎందుకో తన మీద ఎవరో ఒక కన్ను వేసి ఉన్నారని అతని సిక్స్‌త్ సెన్స్ చెప్తోంది. అక్కడే దగ్గరలో ఉన్న సార్జెంటును పిలిచాడు. అతను పరుగెత్తుకుంటూ వచ్చాడు.

"నేను లేనపుడు నా గదిలోకి ఎవరయినా రావటం జరిగిందా?"

"లేదు సర్. ఎవరూ రాలేదు."

"ఆర్యూ ష్యూర్..." ఈసారి వార్నర్ మాటల్లో పదును ధ్వనించింది.

సార్జెంట్ మరోసారి ఆలోచించి, "క్లీన్ చెయ్యటానికి వచ్చిన సంతోష్ తప్ప మరెవరూ రాలేదు సర్..." అన్నాడు.

అతన్ని పక్కకు తీసుకు వెళ్ళిన వార్నర్, "ఈ గది మీద ఒక కన్ను వేసి ఉంచు. ఎవరయినా అనుమానాస్పదంగా ప్రవర్తిస్తే, నువు కల్పించుకోకు. కానీ, ఏం జరుగుతుందో నాకు చెప్పు..." అని మీటింగుకు సమయం మించి పోతుండటంతో, ఆ సంభాషణని అంతటితో ముగించి ఆఫీసుకు వెళ్ళి పోయాడు వార్నర్.

మీటింగులో పెద్ద పెద్ద జనరల్స్ పాల్గొన్నారు.

ఈశాన్య భారతంలోకి బోసు రూపంలో ముంచుకు వస్తున్న ముప్పు మీద చర్చ జరిగింది. కలనల్ వార్నర్ అదనపు దళాల కోసం డిమాండ్ పెట్టాడు. మిలటరీ హెడ్‌క్వార్టర్ నుండి అతని అభ్యర్ధనకు జవాబు వచ్చింది. అందులో వచ్చిన మెసేజ్ క్లియర్‌గా ఉంది. అదనపు దళాలను పంపే అవకాశం ఏమాత్రం లేదని, ఉన్నవారితో సర్దుకోవాలని, ఎట్టి పరిస్థితుల్లో శత్రువును అడుగు ముందుకు వేయనివ్వ కూడదని ఉంది.

ముందుగా మిలటరీ జనరల్ మాట్లాడాడు. "మన దగ్గర ఉన్న సైన్యం జపాను–ఆజాద్ హింద్ ఫౌజుల సైన్యంతో పోల్చుకుంటే సంఖ్యలో చాలా తక్కువ. మనకు అదనపు బలగాలు వచ్చే అవకాశం కూడా లేదు. ఇలాటపుడు శత్రువును జయించాలంటే మంద బలం కంటే మంచి వ్యూహం ఉపకరిస్తుంది. మీరందరూ మీ మీ అభిప్రాయాలు చెప్పండి." అన్నాడు.

చాలా మంది చాలా సలహాలు చెప్పారు. వాటి మీద చాలా సేపటి నుండి చర్చ జరుగుతోంది.

ఇంతలో ఒక వ్యక్తి వార్నర్ దగ్గరకు వచ్చి ఒక చీటీ ఇచ్చాడు. ఇంటి దగ్గర కాపలా కాసే సార్జెంట్ తన కోసం వచ్చి ఉన్నాడని ఉంది అందులో.

"ఎక్స్‌క్యూజ్ మీ..." అంటూ పర్మిషన్ తీసుకుని మీటింగు నుండి బయటకు వచ్చాడు వార్నర్.

సార్జెంట్ స్టిఫ్‌గా సెల్యూట్ చేసి, "సర్! మీరు చెప్పింది నిజమే... మీరు వెళ్లాక మీ గది మీద మరింత నిఘా పెట్టాను. కొత్తగా చేరిన పని కుర్రాడు సంతోష్ మరొకసారి మీ గదిలోకి వెళ్లాడు. చేతికి తగిలినట్లు తగిలించి కొన్ని కాగితాలు కింద పడేశాడు. వాటిని వెంటనే తీసి టేబుల్ మీద పెట్టకుండా, గదిని శుభ్రం చేసే నెపంతో ఆ కాగితాలలో ఉన్న మ్యాటర్ చదువుతున్నాడు..." చెప్పాడు సార్జెంట్. "మీరు సరే అంటే వాడిని అరెస్ట్ చేసి తీసుకు వస్తాను..."

"వద్దు..." వెంటనే అన్నాడు కలనల్ వార్నర్. "వాడు నిజంగా ఆజాద్ హింద్ ఫౌజ్ గూఢచారి అయిన పక్షంలో వాడిని ఏమి చెయ్యాలో నా దగ్గర ఒక ఆలోచన ఉంది. నువు మాత్రం వాడికి ఏ మాత్రం అనుమానం కలిగించకుండా మామూలుగా ఉండు..." అన్నాడు.

తరువాత సార్జెంటును వెనక్కి పంపించి తను తిరిగి మీటింగ్ హాలులోకి నడిచాడు.

ఉన్న తమ తక్కువ సైన్యాన్ని ఎక్కడెక్కడ మోహరించాలన్న విషయం మీద ఇంకా చర్చ తీవ్రంగా జరుగుతోంది.

"మీ ఆలోచన ఏమిటి వార్నర్?" అడిగాడు జనరల్.

"మన సైన్యాన్ని వెంటనే ఇంఫాల్, కోహిమా నుండి ఉపసంహరించటం..."

"వ్వాట్..." అన్నారు సమావేశంలో ఉన్న అందరు. "ఆజాద్ హింద్ సైన్యం ఉత్సాహంతో ఉరకలు ఎత్తుతోంది. దానికి ఒక్క అంగుళం దూరే ఛాన్సు ఇస్తే మొత్తం దేశాన్ని కబళిస్తుంది. మనల్ని దేశం నుండి తరిమి కొడతారు."

"మన సైన్యం వారి సైన్యంలో నాలుగో వంతు కూడా లేదని మీరే చెప్పారు. మరి ధర్మయుద్ధం చేస్తే ఎలా గెలుస్తాం?" అన్నాడు వార్నర్ నవ్వుతూ.

"అంటే?" అర్థం కాని వారు మళ్లీ అడిగారు.

"ఇప్పుడు మనం కూర్చున్న ఈ కలకత్తా నగరం రెండు వందల సంవత్సరాల క్రితం మూడు పల్లెటూర్ల సమాహారం. కాళికటా మత్స్యకారుల గ్రామం. సుతనుతి నది ఒడ్డున ఉన్న చేనేత కళాకారుల గ్రామం. వీటితో పాటు గోవిందపూరును నవాబు నుండి అద్దెకు తీసుకున్న ఈస్ట్ ఇండియా కంపెనీ ఈ నగరానికి శంకుస్థాపన చేశారు. 1756 లో ఒకసారి నవాబు సిరాజుద్దౌలా ఈస్ట్ ఇండియా కంపెనీని నగరం నుండి తరిమి కొట్టాడు. అప్పుడు రాబర్ట్ క్లైవ్ తిరిగి ఈ నగరాన్ని నవాబు నుండి ఎలా స్వాధీనం చేసుకున్నాడో మన యుద్ధ తంత్రపు పాఠాల్లో మీరంతా చదువుకునే ఉంటారు. తనకు పది రెట్లు ఎక్కువ ఉన్న నవాబు సైన్యాన్ని రాబర్ట్ క్లైవ్ కుతంత్రంతో ఛేదించాడు. ఇప్పుడు మనకు కూడా అదొక్కటే మార్గం..."

వార్నర్ ఏదో ప్లాను లేకుండా అలా మాట్లాడడని జనరల్‌కి కూడా తెలుసు. అందుకే, "వార్నర్! అందరికీ మరింత అర్థమయ్యేలా నీ ప్లాను ఏమిటో చెప్పు..." అన్నాడు.

"రాబోతున్నది వానా కాలం. ఈశాన్య భారతం మొత్తం విపరీతంగా వానలు కురిసే ప్రాంతం. ఇప్పుడు మన సైన్యాన్ని ఇంఫాల్, కోహిమా నుండి వెనక్కు పిలిపిస్తే ఆ విషయం తెలుసుకున్న ఆజాద్ హింద్ సైన్యం ముందు వెనుక

చూసుకోకుండా బర్మా దాటి వచ్చేస్తారు. ఒకసారి వారు భారతదేశంలోకి వచ్చాక వర్షాలు మొదలవుతాయి. మన్ను, మిన్నూ ఏకం చేసేలా పడే వానలకు అడవుల్లో అంటు వ్యాధులు ప్రబులుతాయి. వారికి ఆహార ధాన్యాలు సప్లై చేసే దారులన్నీ మూసేద్దాం. ఆ సైన్యం అడవుల్లోనే రోగాల బారిన పడి, తిండి లేక మలమల మాడి మరణిస్తుంది…" తన కసిని మాటల్లో చూపిస్తూ చెప్పాడు వార్నర్.

"నువు చెప్పిన ప్లానులో ఒక లోపం ఉంది వార్నర్. దేశంలోకి ఒకసారి ప్రవేశించాక ఆజాద్ హింద్ సైన్యం అడవుల్లో ఎందుకు ఉంటుంది? ఏ ఇంఫాల్‌లోనో, కోహిమాలోనో తల దాచుకుంటారు. వారిని ఎదిరించటానికి పెట్టిన మన సైన్యాన్ని ముందే ఇంఫాల్, కోహిమా నుండి ఉపసంహరించమంటున్నావ్. ఇక వారి సైన్యానికి అడ్డు ఏముంటుంది?"

"ఉంటుంది…" అంటూ జనరల్ దగ్గరకు నడిచాడు వార్నర్. ఎవరికీ వినపడ కుండా అతనికి మాత్రమే వినపడేలా తన పూర్తి ప్లాను వివరించాడు.

"ఎక్సలెంట్…" అన్నాడు జనరల్. "కానీ… ఇంకో చిన్న అనుమానం ఉంది. వాళ్లు వానలు అయిపోయే వరకు ఆగితే…"

"ఆ అవకాశం ఉంది. పెద్దపులిని వేటాడాలంటే ఆవు దూడని ఎర వెయ్యాలి. అలానే ఆజాద్ హింద్ ఫౌజుకు కూడా ఒక ఎర వేస్తాం. మనం సైన్యాన్ని ఉపసంహరించుకుంటున్న విషయాన్ని వారికి చేరేలా చూడాలి. అదే వారిని ముందుగా రావటానికి ప్రేరేపిస్తుంది. ఇప్పుడు దాడి చేస్తే తమకు ఎదురు ఉండదన్న తప్పుడు అభిప్రాయం కలుగుతుంది. భారతంలో అభిమన్యుడు పద్మవ్యూహంలో చిక్కుకున్నట్లు, మన ఉచ్చులో చిక్కుకుని మాడి పోతారు…"

"అంటే, నీ వ్యూహాలను నువ్వే వారికి చేర వేస్తావన్న మాట."

"అవును." నవ్వుతూ అన్నాడు వార్నర్.

"దాన్ని ఎలా చేస్తావ్?"

"ఇంతకాలం అది ఎలా చేయాలో నాకూ తెలియదు. మన మీటింగ్ జరుగుతుండగా నాకు ఒక విషయం తెలిసింది. ఆజాద్ హింద్ ఫౌజ్ గూఢచారి ఒకడు నా దగ్గర పనికి కుదురుకున్నాడు. నా రహస్యాలన్నీ సింగపూరులో ఉన్న వారి హెడ్‌క్వార్టర్స్‌కు చేరవేస్తున్నాడు…"

"మైగాడ్! వెంటనే షూట్ చేసి పారెయ్యి…"

"నో, నో, నో… అతని విషయం మనకు తెలియనట్లే నటిద్దాం. మనం ఏ సమాచారం వారికి తెలియ చెప్పదలచుకున్నామో అదే అతనికి చేరేలా చూద్దాం." చెప్పాడు వార్నర్.

వార్నర్ వైపు అభినందనగా చూశాడు జనరల్.

సమావేశం పూర్తి అయిన తరువాత కూడా వార్నర్ ఇంటికి వెళ్లలేదు. తన యూనిట్‌లో ఉన్న నమ్మకస్తుడయిన సార్జెంటును పిలిచి అతను చేయవలసిన పని గురించి చెప్పాడు. "మా ఇంట్లో పనిచేసే సంతోష్ అనే పనివాడి ఇల్లు ఎక్కడ ఉందో కనుక్కో. ఆ ఇంటికి వెళ్లు. ఆ ఇంట్లో ఎక్కడో రహస్యంగా దాచి పెట్టిన రేడియో ట్రాన్సిమీటర్ ఉంటుంది..."

"అర్థమయింది సార్. దానిని తెచ్చి మీ ముందు పెట్టాలి."

"షటప్! చెప్పింది పూర్తిగా విను. ఆ ట్రాన్స్‌మీటర్‌తో మనకు పని లేదు. సందేశాలు పంపటానికి ఒన్ టైమ్ కోడ్ బుక్ ఉంటుంది. దానిని మొత్తం ఒక్క అక్షరం కూడా పొల్లు పోకుండా కాపీ చేసుకు రావాలి."

"సరే సార్. ఒకవేళ ఈ లోపల ఆ సంతోష్ ఇంటికి తిరిగి వస్తే ఏం చేయమంటారు?"

"అతను రాడు. నువు తిరిగి వచ్చే వరకు అతన్ని ఇక్కడే ఉంచే పూచీ నాది. సరేనా..."

'సరే...' అంటూ బయలుదేర బోయాడు అతను.

"ఆగు. నువు ఆ ఇంట్లోకి ప్రవేశించిన సంగతి ఎవరికీ తెలియ కూడదు. అలానే, సంతోష్ తన ఇంటికి వెళ్లాక తన వస్తువులు ఎవరో వెతికారన్న అనుమానం రాకూడదు. ఎక్కడ తీసిన వస్తువులు ఖచ్చితంగా అక్కడే పెట్టు..."

"అర్థమయింది సర్..." అంటూ వెళ్లిపోయాడు ఆ సార్జెంట్.

ఇంటికి తిరిగి వచ్చిన వార్నర్‌కి దూరంగా పనిచేసుకుంటున్న సంతోష్ కనిపించాడు. అతడిని ఏదో ఒక వంకతో ఇంటికి వెళ్లకుండా ఆలస్యం చెయ్యాలి. అక్కడే ఉన్న సార్జెంటును పిలిచి సంతోష్ చేత తోటలో లాన్ ట్రిమ్ చేయించమని చెప్పాడు. "ఎంత పొద్దు పోయినా పని ఇవాళే పూర్తి కావాలి. పని పూర్తి అయ్యాక కూడా నా అనుమతి లేకుండా సంతోష్‌ని బయటకు పంపవద్దు..." అని చెప్పి క్లబ్‌కి వెళ్ళి పోయాడు.

వార్నర్ చెప్పిన పని చేయటం తప్ప సంతోష్‌కి మరో మార్గం లేదు. అందుకే అతను ఆ పని చేయటంలో మునిగి పోయాడు.

సాయంత్రం పొద్దు పోయిన తరువాత వార్నర్ పంపిన సార్జెంట్ తిరిగి వచ్చాడు. తనతో తెచ్చిన పుస్తకాన్ని క్లబ్‌లో కూర్చున్న వార్నర్‌కి ఇచ్చాడు. సంతోష్ గదిలో ఉన్న ఒన్ టైమ్ కోడ్ మొత్తం అందులో కాపీ చేసి ఉంది.

*(కొనసాగింపు వచ్చే నెలలో)*

COMMENTS